సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



ఉత్తరాంధ్ర ద్రోహి గో బ్యాక్

చంద్రబాబుకు నిరసన సెగ తలిగింది. బాబు సిక్కోలు పర్యటనలో కొందరు నిరసన తెలిపారు. - 8లో



నాన్నా.. చనిపోతున్నా..!

భిన్నఆమదనాపురం పంచాయతీ కార్యదర్శి స్పందన మృతి చెందారు. ఆమె కిడ్నీ వ్యాధితో కన్నుమూశారు. - 8లో

నేడు సున్నా వడ్డీ రాయితీ విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు రుణాలపై ప్రభుత్వం అందజేసే సున్నా వడ్డీ రాయితీ నాలుగో విడతను శుక్రవారం లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ విడతలో 51,643 సంఘాలకు గాను రూ.69.06 కోట్లు అందజేయనున్నారు. ఇందులో మెప్మా పరిధిలో 4,384 సంఘాలకు గాను రూ.7.93 కోట్లు, డీఆర్‌డీఏ పరిధిలోని 47,359 సంఘాలకు గాను రూ.61.13 కోట్లను అందజేస్తున్నారు.

న్యూస్‌రీల్

టెక్కలి సబ్ కలెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు



రాహుల్‌కుమార్ రెడ్డి దంపతులను సత్కరిస్తున్న డివిజన్ అధికారులు

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డికి డివిజన్ పరిధిలో గల రెవెన్యూ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులంతా ఆత్మీయ వీడ్కోలు పలికారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా పనిచేస్తూ ఇటీవల నంద్యాల జేసీగా రాహుల్‌కుమార్ రెడ్డి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో పాటు డివిజన్ పరిధిలో గల వివిధ శాఖలకు చెందిన అధికారులంతా సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి దంపతులకు ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయం పరిపాలనాధికారి బి.రాజమోహన్, తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ, ఎంపీవో సంజీవరావు తో పాటు డివిజన్ పరిధిలో తహసీల్దార్లు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ వెబ్ ఆప్షన్ల నమోదు నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్-2023 కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు వాయిదా పడిన నేపథ్యంలో సాంకేతిక విద్యాశాఖ రీషెడ్యూల్‌ను గురువారం విడుదల చేసింది. మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లమా ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో భాగంగా మే 29 నుంచి జూన్ ఐదు వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేశారు. అనంతరం జూన్ ఒకటి నుంచి జరగాల్సిన ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ వాయిదా పడింది. ఈ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమై 14వ తేదీ వరకు కొనసాగనుంది. గతంలో ర్యాంకు వచ్చి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కాని విద్యార్థులు సైతం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రంలో నిర్వహిస్తున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావచ్చు. ఆప్షన్ల నమోదులో ఇబ్బందులు ఉంటే సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని జిల్లా కౌన్సెలింగ్ ఇన్‌చార్జి, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. షెడ్యూల్ మేరకు శుక్రవారం నుంచి 14వ తేదీ వరకు ఆప్షన్ల నమోదు, 16వ తేదీన ఆప్షన్ల మార్పు, 18వ తేదీన సీట్లు అలాట్ మెంట్, కళాశాలకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు చేయటం 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు, 23వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ జరగనున్నాయి.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వే స్టేషన్ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరబ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. నూతన డీఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన ఆయన గురువారం పలు స్టేషన్లలో పర్యటించారు. అందులో భాగంగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ప్లాట్‌ఫామ్‌లపై తిరుగుతూ పరిశీలన జరిపి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే పారిశుద్ధ్య కార్మికులు, క్యాంటీన్ సిబ్బంది, స్థానిక రైల్వే అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం త్రిపాఠి, అడిషనల్ డీసీఎం సునీల్ కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ శివ శంకర్, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఓటరు సర్వే

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఓటర్ల జాబితా పరిశీలన, ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమం నిబంధనల మేరకు జరుగుతున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఇంటింటి ఓటర్ సర్వేపై గురువారం కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ డోర్ టు డోర్ సర్వే వివరాలను తెలియజేస్తూ జిల్లాలో 5,87,151 డోర్ నంబర్లు ఉన్నాయని వాటిలో 3,11,927 హౌస్‌లను బూత్ లెవెల్ అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించార ని తెలిపారు. 53 శాతం సర్వే పూర్తయ్యిందని తెలిపారు. ఒకే డోర్ నంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న వివరాలు, నూరేళ్లు దాటిన వారి వివరాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు, మండల అధికారులు, బూత్ లెవెల్ అధికారులతో నిత్యం మాట్లాడుతూ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

● అధినేతే స్ఫూర్తట..

అడ్డొస్తే నరికేయాలట!

రౌడీ రాజకీయం

- పార్టీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ
- చంద్రబాబు పర్యటనకు ముందు నియోజకవర్గ టీడీపీలో ఫ్లెక్సీల గొడవ
- రచ్చకెక్కిన మామిడి వర్సెస్ కలమట వివాదం
- సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన కలమట బెదిరింపు వీడియో



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రాజకీయం మర్చిపోయిన టీడీపీ నాయకులు అరాచక వైఖరిని అనుసరిస్తున్నారు. పుంగనూరు స్ఫూర్తితో పాతపట్నంలోనూ రౌడీ రాజకీయాలకు ఆ పార్టీ నేత కలమట వెంకటరమణ తెర తీశారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోకి ప్రవేశించకముందే ఆ పార్టీ నాయకుడి రౌడీయిజం బయటపడింది. చంద్రబాబు పర్యటన సాగే ప్రాంతాల్లో తన ఫ్లెక్సీలు తప్ప మిగతా ఎవరివి కట్టొద్దని హుకుం జారీ చేయడమే కాకుండా అడ్డొచ్చినోళ్లని నరికేయండి...కాళ్లు విరగొట్టండి...నేను చూసుకుంటానంటూ విరుచుకుపడ్డారు. ఈ బెదిరింపులు ప్రత్యర్థి పార్టీ నాయకులపై చేసినవి కావు.. ఆ పార్టీలోని సహచర నాయకుడిని ఉద్దేశించి చేసినవి కావడం గమనార్హం. పార్టీలో తనకు బలమైన ప్రత్యర్థిగా తయారైన మామిడి గోవిందరావు అండ్‌కోను డైరెక్ట్‌గా బెదిరించారు. తనను ఎవరూ ఏమీ చేయలేరన్న అహంకారంతో నోటికొచ్చినట్టు తోటి తెలుగు తమ్ముళ్లను తిట్టిపోయడమే కాకుండా నరికేద్దామనే స్థాయికి వెళ్లిపోయారు.

పాతపట్నం నియోజకవర్గ టీడీపీలో ఆధిపత్య పోరు తారా స్థాయికి చేరింది. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు మామిడి గోవిందరావు కొరకరాని కొయ్యగా తయారయ్యారు. రోజురోజుకీ మామిడి పార్టీలో బలపడుతుండటాన్ని కలమట జీర్ణించుకోలేకపోతున్నారు. దాదాపు నియోజకవర్గ కీలక కేడర్ అంతా మామిడి గోవిందరావు వైపు వచ్చేసింది. కలమటకు ఎలాగైనా బుద్ధి చెప్పాలన్న కసితో పాతపట్నం కేడర్ మామిడి పంచన చేరడమే కాకుండా బహిరంగ సమావేశం పెట్టి మనసులో మాట వెల్లడించారు. తక్షణమే పార్టీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి కలమటను తప్పించాలని, ఆ బాధ్యతలు మామిడి గోవింద్‌కు అప్పగించాలని విలేకరుల సమావేశం పెట్టి డిమాండ్ చేశారు. క్రమేపీ కేడర్ దూరమవుతుండటం, ఆయనకు వ్యతిరేకంగా గ్రూపు కట్టడాన్ని కలమట తట్టుకోలేకపోతున్నారు. తన రౌడీయిజం చూపించి కేడర్‌ను దారికి తెచ్చుకోవాలని, మామిడి గోవిందరావుకు పరోక్ష వార్నింగ్ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా చంద్రబాబు పర్యటన సమయంలో తన ప్రాబల్యం తప్ప ఇంకెవరిదీ కనబడకూడదన్న ఉద్దేశంతో ఫ్లెక్సీల రాద్ధాంతానికి దిగారు.

చంద్రబాబు పర్యటన మరికొన్ని గంటల్లో నియోజకవర్గంలోకి ప్రవేశిస్తుందనగా కలమట తన సహజ శైలిని చూపించారు. చంద్రబాబు పర్యటించే దారి పొడవునా తన ఫ్లెక్సీలు తప్ప మిగతావారివి కనిపించకూడదంటూ.. దారి పొడవునా ఇతరులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా అప్పటికప్పుడు కడుతున్నవి కూడా పీకి పారేశారు. అంతటితో ఆగకుండా మామిడి గోవిందరావు ఫ్లెక్సీలు కడుతున్న వారిని దారుణంగా తిట్టడమే కాకుండా బెదిరించారు. 'మన ఫ్లెక్సీలు కనబడాలి... ఇతరులివి కడితే ఊరుకోవద్దు...అడ్డొచ్చిన వారిని నరికేయండి....కాళ్లు విరగొట్టండి' అంటూ తనతో పాటు ఉన్న కార్యకర్తలకు హుకుం జారీ చేశారు. హిరమండలం రిజర్వాయర్ దగ్గరలోనైతే తనే దగ్గరుండి.. అడ్డొచ్చిన వాళ్లను నరికేయండి అని తన కార్యకర్తలను ఉసిగొల్పారు. తనతో పెట్టుకోవద్దని.. తానేంటో చూపిస్తాను అన్నట్టుగా మామిడి గోవిందరావు వర్గీయులకు సూటిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఏం చేయాలో పాలుపోక మామిడి వర్గీయులు వెనక్కి తగ్గిపోయారు. కలమట రౌడీయిజం చేస్తున్నారంటూ వాపోతూ ఒకరికొకరు చెప్పుకుని బాధపడ్డారు.

ముమ్ముందు పాతపట్నం టీడీపీలో గొడవలు తప్పవనే అభిప్రాయం బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం జరిగే పరిణామాల ప్రకారం స్పష్టమవుతోంది. తన రౌడీ రాజకీయంతో పార్టీలోని ప్రత్యర్థులను బయటపెట్టి దారికి తెచ్చుకోవాలన్న యోచనలో కలమట ఉన్నట్టు అర్థమవుతోంది. తన సహజ శైలిలో వెళ్లకపోతే ప్రతి ఒక్కరూ తనని టార్గెట్ చేస్తారనే అభద్రతా భావంతో బరితెగిస్తూ విశ్వరూపాన్ని చూపిస్తున్నారు. మామిడి వర్గీయులను బెదిరించిన దృశ్యాలను ఎవరో వ్యక్తులు రికార్డు చేసి సోషల్ మీడియాలో వదిలారు. ఈ వీడియోను చూసి కలమట రౌడీయిజం చేయడానికి సిద్ధమైపోయారని అంతా చెప్పుకుంటున్నారు.

'లోక్ అదాలత్ వినియోగించుకోండి'



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజీమార్గమే రాజమార్గమని, దీన్ని కక్షిదారులు గ్రహించి కేసులు రాజీ చేసుకోవాలని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన గురువారం న్యాయస్థానం ఆవరణలో మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జిల్లా అంతటా ఘనంగా జరుపుతున్నామని, సుమారు 7 వేల కేసులు రాజీకి సంబంధించినవిగా గుర్తించామన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి అందరికీ ముందస్తు సమాచారం అందించామన్నారు. లోక్‌అదాలత్ ఉద్దేశాన్ని కక్షిదారులకు విస్తృత స్థాయిలో వివరించామని అన్నారు. కక్షిదారులు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

స్నేహమంటే ఇదేరా



వజ్రపుకొత్తూరు: మొన్ననే ఫ్రెండ్‌షిప్ డే జరుపుకున్నాం. ఎఫ్‌బీలో పోస్టులు, వాట్సాప్‌లో స్టేటస్‌లు, ఇన్‌స్టాలో రీళ్లతో అంతా హోరెత్తించారు. ఆ ఒక్క రోజు అయిపోగానే అంతా నిశ్శబ్దమైపోయారు. ఇలాంటి 'డే'లకు చాలా ఏళ్ల ముందు నుంచే సిక్కోలు పల్లెలు స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ఈ అరుదైన వేడుకకు గురు వారం మత్స్యకార గ్రామం దేవునల్తాడ వేదికైంది. శ్రావణ మాసంలో ఓ గురువారం ఇక్కడ 'మిత్ర వారాలు' నిర్వహిస్తారు. వరసకు వచ్చేవారినైతే మొకర, గాదెప్ప, బొన్నిగా పిలుస్తారు. అదే వరసకు రాని వారినైతే మిత్త, పువ్వలు, మిత్తప్పగా పిలుస్తారు. ఇందు కోసం ముందుగా గ్రామంలో గ్రామ దేవతకు పూజలు నిర్వహించి మిత్రులు ఇంటికి చేరుకోగానే ఇంటిపై పసుపు నీళ్లు జల్లి ఆ నీళ్లు తలపై పడగానే ఇంటిలోకి ప్రవేశిస్తారు. అనంతరం ఇంటి దేవత వద్ద ఉంచిన కొబ్బరి కాయ, పువ్వ నెయ్యిలు ఇరువురి చేతిలో పంచుకుంటారు. ఒకరికొకరు పేరు పెట్టుకోకుండా మిత్త, పువ్వలు, మొకర, గాదెప్ప, మిత్తప్పగా పిలుస్తారు. అనంతరం ఇంటిలో వండిన పిండి వంటలు, జావ ఆరగిస్తారు. ఈ తంతు రాత్రి 7 నుంచి 11 గంటల వరకు జరుగుతుంది. చాలాకాలంగా తమకు ఆనవాయితీగా వస్తోందని సర్పంచ్ వరదరాజులు, ఎంపీటీసీ సభ్యుడు వెంకటన్న చెప్పారు.



గ్రామదేవతకు పూజలు నిర్వహిస్తూ..



దేవునల్తాడలో స్నేహానికి ప్రతీకగా మిత్రవారాల వేడుక చేసుకుంటున్న చిన్నారులు

14 వరకు ఇంజినీరింగ్ ఆప్షన్ల ఎంపికకు అవకాశం



ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీ సెట్-2023 ఇంజినీరింగ్ స్ట్రీం ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 14వరకు ఆప్షన్లు ఇచ్చుకునేందుకు సాంకేతికవిద్యాశాఖ అవకాశం కల్పించిందని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. సహాయ కేంద్రంలో గురువారం వివరాలు వెల్లడించారు. 14వ తేదీ ఆప్షన్ల ఎంపికకు చివరి తేదీ కాగా, 16వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. 23న సీట్లు కేటాయింపు, 30వ తేదీ లోపు సెల్ఫ్ రిపోర్టింగ్, 31వ తేదీ నుంచి క్లాస్‌వర్క్ ప్రారంభమవుతుందని అన్నారు.

ఏసీబీకి చిక్కిన వీఆర్‌ఓ

- రూ. 20వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన కోటపాలెం వీఆర్వో శ్రీనివాసరావు



ఏసీబీకి దొరికిన వీఆర్‌ఓ శ్రీనివాసరావు

రణస్థలం: రణస్థలం మండలంలోని కోటపాలెం వీఆర్‌ఓగా పనిచేస్తున్న పాగర శ్రీనివాసరావు రూ.20వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ బీవీవీఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. కోటపాలెం రెవెన్యూలో గొర్లె సన్యాసప్పలనాయుడు కుటుంబానికి చెందిన కొంత భూమి వివాదంలో ఉండి న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. సన్యాసప్పలనాయుడుకు ఇద్దరు భార్యలు. సన్యాసప్పలనాయుడు చనిపోయాక ఆస్తి పంపకాలపై వివాదాలు నెలకొన్నాయి. విజయనగరం టౌన్‌లో ఉంటున్న రెండో భార్య గొర్లె వరలక్ష్మి కోటపాలెం ఉన్న భూమిలో తనకు రావాల్సిన వాటాకు సంబంధించి ఇక్కడి తహసీల్దార్‌తో పాటు జిల్లా స్పందనలో కూడా ఫిర్యాదు చేశారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఎవరికీ లేకపోవడంతో భూ పంపకం పెండింగ్‌లో పెట్టాలని కొన్ని రోజులుగా వీఆర్‌ఓ శ్రీనివాసరావును కలుస్తూ ఉన్నారు. అయితే అవతలి వారి పేరుతో భూ పట్టాదారు పాసు పుస్తకాలు వస్తే నిలిపివేయడానికి వీఆర్‌ఓ రూ.30వేలు లంచం డిమాండ్ చేశారు. ఆఖరికి రూ.20వేలకు బేరం కుదిరింది. ఈ పరిణామాల నేపథ్యంలో వరలక్ష్మి అవినీతి నిరోధక శాఖ అధికారులను సంప్రదించారు. వారి సూచనల ప్రకారం గురువారం ఉదయం 9 గంటల సమయంలో విజయనగరంలోని వీఆర్‌ఓ ఇంటికి వెళ్లి వరలక్ష్మి డబ్బులు ఇస్తుండగా ఆ చుట్టపక్కలే మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు వీఆర్‌ఓను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పూర్తి వివరాల కోసం రణస్థలం తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్నామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐలు కె.భాస్కరరావు, బి. హరి, సిబ్బంది ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాల్సిందే: కలెక్టర్



పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం: పిల్లలందరూ నులి పురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపు నిచ్చారు. అరసవిల్లి కోరాడవీధిలో నగర పాలక పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 2-19 ఏళ్ల వయస్సు లోపల ఉన్న విద్యార్థులందరూ ఒక ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలన్నారు. మాత్రల వల్ల ఏ విధమైన ఇబ్బందులు ఉండవని, ఏ విధమైన ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తన పిల్లలకు కూడా ఈ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎవరైనా పాఠశాలకి రాకపోతే వారికి కూడా మాత్రలు పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో 4,44,162 మంది పిల్లలు ఉన్నట్లు చెప్పారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపుల నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మీనాక్షి, డాక్టర్ శ్రీదేవి, డీపీఎంఓ లింగరాజు, సాయిదివ్య, డీఈవో వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం విమల, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నగదు రహితం.. జన హితం

- 15వ తేదీ నుంచి పంచాయతీల్లో నగదు రహితంగా పన్నుల వసూలు
- జిల్లాలో 3 వేల జనాభా మించిన పంచాయతీల్లో పీఓఎస్ మిషన్లు
- మిగిలిన పంచాయతీల్లో క్యూఆర్ కోడ్ ద్వారా పన్నుల చెల్లింపు సౌకర్యం



శ్రీకూర్మం మేజర్ పంచాయతీ

అరసవల్లి: ప్రతి పంచాయతీ కార్యాలయంలోనూ నగదు రహిత వసూళ్లు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల 15న దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ సేవలను జిల్లాలో అమలు చేసేలా చర్యలు చేపడుతోంది. పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పన్నులను ఆన్‌లైన్ విధానంలో వసూలు చేసేందుకు అధికార యంత్రాంగం మిషనరీ ఏర్పాటు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా ఎప్పటికప్పుడు ఈ పన్నుల (టాక్స్, నాన్ టాక్సెస్) వసూళ్లపై సమీక్షిస్తున్నారు. దీంతో పన్నుల వసూళ్లను ఇక మీదట క్యాష్‌లెస్ విధానంలోనే పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్), క్యూఆర్ కోడ్‌ల ద్వారా వసూలు చేసేలా క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు వేల జనాభా దాటిన పంచాయతీల్లో..



జిల్లాలో 3 వేల జనాభా మించిన పంచాయతీల్లో పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మిషన్లను అందుబాటులోకి తేనున్నారు. జిల్లాలో ఈమేరకు మొత్తం 912 గ్రామ పంచాయతీల్లో 126 పంచాయతీల్లో పీఓఎస్ మిషన్లు ఏర్పాటు చేశారు. కాగా మిగిలిన 786 పంచాయతీల్లో మాత్రం క్యూఆర్ కోడ్ ద్వారానే వివిధ రకాల పన్నుల వసూళ్లను చేపట్టనున్నారు. ఆయా పరిధిలో అసెస్‌మెంట్ల నుంచి ఆన్‌లైన్ ద్వారా పన్నుల వసూళ్లకు రంగం సిద్ధం చేస్తోంది. దీంతో ఈనెల 15 నుంచి ఈ క్యూఆర్ కోడ్ స్కానింగ్/డెబిట్/క్రెడిట్ కార్డుల ద్వారా పన్నుల చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టనున్నారు.

ఆన్‌లైన్ చెల్లింపులు ఇలా..



- పంచాయతీలకు చెందిన ఇంటి పన్నులు, ప్రోపర్టీ టాక్స్, బిల్డింగ్ రెన్యువల్ ఫీజు, ప్రైవేటు వాటర్ టాక్స్, రోజువారీ మార్కెట్, వారపు సంతలు, వ్యాపార ట్రేడ్ లైసెన్సులు, చేపల చెరువుల చార్జీలు తదితర పన్నులు, ఫీజులను ఈ కొత్త విధానంలోనే వసూలు చేయనున్నారు.
- గ్రామాల వారీగా ఇంటి యజమానుల వివరాలు, ఇంటి విస్తీర్ణం, భవన నిర్మాణం తీరు ఆధారంగా నిర్ధారించిన పన్నుల వివరాలన్నీ పీఓఎస్ మిషన్లతో అనుసంధానించిన సాఫ్ట్‌వేర్‌లో పంచాయతీ కార్యదర్శి అప్‌లోడ్ చేస్తారు.
- పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి ప్రత్యేక కోడ్ నంబర్ కేటాయింపు జరుగుతుంది. ఈ కోడ్ నంబర్‌ను పీఓఎస్ మిషన్‌లో నమోదు చేయగానే పన్ను చెల్లించాల్సిన మొత్తం స్క్రీన్‌పై కనిపిస్తుంది.
- ఈ పన్నుల వివరాలను బట్టి ఇంటి యజమాని ఆన్‌లైన్‌లో చెల్లించే మార్గాలను చూపిస్తుంది. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర వాటిల్లో ఎంపిక చేసుకుని క్రెడిట్/డెబిట్ కార్డు లేదా క్యూఆర్ స్కాన్ చేసి పేమెంట్ చేస్తే.. నేరుగా పంచాయతీకి చెందిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కరెంట్ ఖాతాల్లోకి ఆ నగదు జమ అవుతుంది.
- ఈ ఆన్‌లైన్ విధానం కోసం ప్రతి పంచాయతీ కార్యదర్శి, ఆయా పంచాయతీ కోడ్ తదితర వివరాలతో ఎస్‌బీఐ కరెంట్ ఖాతాను ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఇలా ఈ ఖాతాల్లో జమ అయిన నగదు నేరుగా పంచాయతీ పేరిట ఉండే ట్రెజరీ అకౌంట్‌కు చేరేలా తద్వారా తిరిగి పంచాయతీ జనరల్ ఫండ్‌గా జమ అయ్యేలా ఏర్పాట్లు జరిగాయి. ఈ విధానంతో ఎక్కడా నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి.

వసూళ్ల లక్ష్యం చేరేలా..



జిల్లాలో మొత్తం 30 మండలాల్లో 912 గ్రామ పంచాయతీలుండగా, వీటిలో 11 మేజర్ పంచాయతీలున్నాయి. సుమారుగా జిల్లాలో 5,10,651 గృహ అసెస్‌మెంట్లు ఉండగా, వీటి నుంచి 2022-23 వార్షిక ఆదాయానికి రూ.22.02 కోట్లు, పంచాయతీల పరిధిలోని మార్కెట్ షాపులు, లీజుల ద్వారా నాన్ టాక్స్‌ల రూపంలో రూ.3.29 కోట్లు కలిపి మొత్తంగా రూ. 25.31 కోట్ల లక్ష్యానికి ఇప్పటివరకు 68 శాతం వరకు మాత్రమే కలెక్షన్లు వసూలయ్యాయి. తాజాగా ఆన్‌లైన్ విధానాన్ని పరిచయం చేయడం ద్వారా వసూళ్ల లక్ష్యాలు వీలైనంత త్వరగానే సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పంచాయతీ సెక్రటరీనే బాధ్యుడు



జిల్లాలో ఈనెల 15 నుంచి క్యాష్‌లెస్ వసూలు విధానం అమల్లోకి రానుంది. అయితే ఇందుకు ప్రతి పంచాయతీ సెక్రటరీ వివరాలతో సమీప ఎస్‌బీఐలో కరెంట్ ఖాతాలను పంచాయతీల పేరిట ఓపెన్ చేయాలి. ఈ ఖాతాల్లోకి పన్నుల వసూళ్లు నేరుగా పంచాయతీల జనరల్ ఫండ్‌గా జమ కానున్నాయి. ఈ విధానంతో అక్రమాలకు తావులేకుండా ఉంటుంది. ఈ ఆన్‌లైన్ లావాదేవీలకు పూర్తిగా పంచాయతీ సెక్రటరీలే ప్రధాన బాధ్యులుగా ఆదేశాలున్నాయి.

– వి.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి

ఉత్సాహంగా జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికల ప్రారంభ కార్యక్రమంలో ఫెన్సింగ్ సంఘ ప్రతినిధులు, అతిథులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపికలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. బలభద్రుని రాజా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో జిల్లాస్థాయి అండర్-20 బాలబాలికల ఫెన్సింగ్ ఎంపిక పోటీలు జరిగాయి.

ఈ పోటీలను శ్రీకాకుళంలోని వ్యాపారవేత్త బలభద్రుని రాజా ప్రారంభించారు. పోటీల్లో బాలురు ఫాయిల్ విభాగంలో సంపతరావు గౌతమ్ చంద్ర, డి.ప్రణయ్, జి.చంద్రశేఖర్, పి.సునీల్, ఇప్పీ విభాగంలో ఎస్.మురళీ కృష్ణ, ఎస్.రోహిత్ రాజు, కె.జయప్రకాష్, వై.దిలీప్ కుమార్‌లు ఎంపికయ్యారు. బాలికల ఫాయిల్ విభాగంలో కె.ఎస్.భవానీ, వి.బేబిషామిలి, ఎం.శ్రీమనస్వీ, ఇప్పీ విభాగంలో ఎం.బ్లెస్సీ రేచల్, ఎస్.అర్చన, ఎస్.యమునలు ఎంపికయ్యారు.

క్లుప్తంగా

ముగిసిన ఫైనల్ పోటీలు



వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, క్విజ్, వ్యాసరచన ఫైనల్ పోటీలు గురువారంతో ముగిశాయి. నూతన విద్యావిధానం, నవరత్నాలు అమలు– పేదలు జీవితంలో వెలుగులు అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించారు. ఈనెల 8, 9వ తేదీల్లో మండల స్థాయిలో విజేతలైన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థుల వివరాలు జిల్లా విద్యాశాఖకు అందజేశారు. వర్సిటీలో ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో బహుమతులు ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు.

తూర్పుకాపు సంఘ జాతీయ గౌరవాధ్యక్షుడిగా పతివాడ



గిరీశ్వరరావు

నరసన్నపేట: స్థానిక పురుషోత్తంనగర్‌కు చెందిన పతివాడ గిరీశ్వరరావు ఆలిండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ గౌరవ అధ్యక్షునిగా ఎంపిక య్యారు. ఈ మేరకు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా గిరీశ్వరరావును పలువురు నాయకులు అభినందించారు.

రిమ్స్ ఆర్ఎంవోగా విధుల్లో చేరిన శంకరరావు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ ఆర్ఎంవోగా డాక్టర్ శంకరరావు గురువారం విధుల్లో చేరారు. కొద్దిరోజుల క్రితం పలు వివాదాస్పద సంఘటనలకు కేంద్ర బిందువుగా ఉన్నారని శంకరరావును జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిమ్స్ సూపరింటెండెంట్ ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టును ఆశ్రయించిన శంకరరావు స్టే రావడంతో గురువారం విధుల్లో చేరారు. అయితే డీఎంఈ నుంచి ఎటువంటి ఆదేశాలు లేకపోవడంతో రిమ్స్ అధికారులు ఆయనను చేర్చుకోవడంలో తర్జనభర్జన పడ్డారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించగా అక్కడి నుంచి సమాధానం రాకముందే శంకరరావు విధుల్లో తాను చేరుతున్నట్లు రిమ్స్ అధికారులకు తెలిపి రిజిస్టర్‌లో సంతకం చేశారు. శుక్రవారం దీనిపై రాష్ట్ర స్థాయి నుంచి వివరణ వచ్చే అవకాశం ఉంది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24క్యా. 10గ్రా.)	60,380–00
బంగారం(22క్యా. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

ఉత్తరాంధ్ర ద్రోహి గో బ్యాక్



ఆమదాలవలసలో ఫ్లకార్డులతో నిరసనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

- చంద్రబాబు సిక్కోలు పర్యటన సందర్భంగా నిరసనల హోరు

కొత్తూరు/ఎల్.ఎన్.పేట: సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శిస్తూ జిల్లాకు వచ్చిన చంద్రబాబుకు నిరసన సెగ తగిలింది. కొత్తూరు మండలం గూనభద్ర వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తుండగా నిర్వాసితులు నిరసన తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు పోలీసు బలగాలు పెట్టి తమను నెట్టేసిన చంద్రబాబు ఇప్పుడు తమ వద్దకు రావడం సరికాదని మండిపడ్డారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ సంపద సృష్టించే ఆలోచనా శక్తి తనకుందని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. నదుల అనుసంధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.



వెలవెలబోతున్న చంద్రబాబు కాన్వాయ్

ఆమదాలవలస: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సిక్కోలు పర్యటనపై వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్, పార్టీ నాయకులతో గురువారం నిరసనల హోరు వినిపించారు. ఉత్తరాంధ్ర ద్రోహి గో బ్యాక్–సిక్కోలు ద్రోహి గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీలతో నిరసన తెలిపారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో జిల్లాకు ఏమీ చేయక పోగా.. వంశధార, కిడ్నీ ప్రాజెక్టు, ఆఫ్‌షోర్ వంటి వాటితో జిల్లాకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను దూషించేందుకు ఇక్కడకు రావడం సబబు కాదన్నారు. విశాఖను రాజధానిగా ప్రకటిస్తే అడ్డుకున్న చంద్రబాబు ఉత్తరాంధ్ర ద్రోహి అని అన్నారు. ఈ సందర్భంగా నల్లబెలూన్లు ప్రదర్శించారు. ఆమదాలవలస ఎస్ఐ వై. కృష్ణ ఆధ్వర్యంలో చింతాడ రవికుమార్‌ను అరెస్టు చేసి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ముందు నిరసన తెలుపుతున్న వంశధార నిర్వాసితులు

తూతూమంత్రంగానే..

ఆమదాలవలస/బూర్జ/ సరుబుజ్జిలి: యుద్ధభేరి పేరుతో గురువారం ఆమదాలవలస నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నామమాత్రంగా సాగింది. మన్యం జిల్లా నుంచి బూర్జ మండలం పాలవలస వద్దకు ఉదయం 10 గంటకు చేరుకుంటారని ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం చేరుకున్న టీడీపీ క్యాడర్.. మధ్యాహ్నం 1.30 గంటకు రావడంతో ఇబ్బందులు పడ్డారు. బాబు పర్యటన నేపథ్యంలో నియోజకవర్గానికి ఏదైనా లాభం చేకూరుతుందేమో, ఏదైనా ప్రకటనలు చేస్తారేమో, మాట్లాడుతారేమోనని ఎదురుచూసిన పార్టీ క్యాడర్ చివరకు నిరసగా వెనుదిరిగారు.

సెల్ఫీలతో సరి..

హిరమండలం/ఎల్ఎన్‌పేట: రాష్ట్రవ్యాప్త ప్రాజెక్టు సందర్శనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం హిరమండలంలోని వంశధార జలాశయాన్ని పరిశీలించారు. ఈఈ ఎం.వి.రమణమూర్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ సెల్ఫీ తీసుకున్నారు. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కలమట, మామిడి వర్గాలుగా విడిపోయారు. అయినా పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడకపోవడం గమనార్హం.



మందుబాటిళ్లతో తెలుగు తమ్ముళ్లు

11 ఓపెన్ హెడ్ చానెల్స్ పునరుద్ధరణకు కృషి



బిర్లంగి ఓపెన్ హెడ్ చానెల్స్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇరిగేషన్ అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరాదరణకు గురైన 11 ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ పునరుద్ధరణకు కృషి చేస్తానని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. గురువారం జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి ఇచ్ఛాపురం మండలంలోని ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ పరిస్థితిని పరిశీలించారు. గ్రోయిన్స్ పాడైపోవడంతో పాతికేళ్లగా సాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని బిర్లంగి, బొడ్డబడ, బి.తోటూరు, మశాఖపురం, కొళిగాం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ చేసేందుకు ప్రత్యామ్నాయం లేకపోవడంతో బహుదా నదిలో చేరి అక్కడి నుంచి సముద్రంలో వృథాగా కలిసిపోతోందని చెప్పారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే కేశుపురం న్యూ గ్రోయిన్ పనులు పూర్తయ్యాయని, ఇరిగేషన్ అధికారులచే ఓపెన్ హెడ్ చానెల్స్, గ్రోయిన్స్ మరమ్మతులకు వేసిన అంచనా విలువలను త్వరలో జిల్లాకు రానున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రతిపాదనలు సమర్పిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. చానెల్స్‌తో పాటు బహుదానది నీరు నిల్వ చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ పి.సుధాకరరావు, డిప్యూటీ ఈఈ జి.వి.రమణ, ఏఈఈ మధుసూదన పాణిగ్రాహి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, లిట్టుపాడి, సంతోష్ మండల, చల్లా కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, లోపింటి దీనబంధురెడ్డి, తిప్పన కృష్ణారెడ్డి, బాకి లక్ష్మీనారాయణ, రంగాల జానీ, గండు మహాపాత్రో, రంగాల కృష్ణారెడ్డి, దక్కత జయదేవ్ పాల్గొన్నారు.

మళ్లీ వస్తా.. విద్యార్థులతో మాట్లాడతా..

- అంబేడ్కర్ వర్సిటీలో ఆర్.నారాయణమూర్తి సందడి

ఎచ్చెర్ల క్యాంపస్: 'యూనివర్సిటీ' సినిమా ప్రమోషన్ వర్కులో భాగంగా సీనియర్ నటుడు, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి గురువారం ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆయన స్వీయ దర్శకత్వంలో స్నేహచిత్ర పిక్చర్స్‌లో ఈ సినిమా నిర్మించారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్యను కలిసి విద్యార్థులతో మాట్లాడే అవకాశం కల్పించాలని కోరారు. అయితే ప్రస్తుతం సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయని, మరోసారి రావాలని కోరారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ యూనివర్సిటీ సినిమాను ఆదరించాలని కోరారు. అక్టోబర్ 4న శ్రీకాకుళం పట్టణంలో యూనివర్సిటీ మూవీ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించనున్నట్లు చెప్పారు. విద్యా ప్రమాణాలు, రాజకీయ జోక్యం, విద్యార్థుల సమస్యలను సినిమాలో ప్రస్తావించామన్నారు. తప్పకుండా విద్యార్థులను ఆకట్టుకుంటుందన్నారు. మరోసారి విశ్వవిద్యాలయం సందర్శించి విద్యార్థులతో మాట్లాడతానని చెప్పారు.



ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య, సిబ్బందితో ఆర్.నారాయణమూర్తి

నాన్నా.. చనిపోతున్నా..!

- అనారోగ్యంతో కుప్పకూలి మృతిచెందిన పంచాయతీ కార్యదర్శి స్పందన



కొత్తపల్లి స్పందన (ఫైల్)

మందస/పలాస: మందస మండలం బిన్నళమదనాపురం పంచాయతీ వెంకటవరదరాజపురం గ్రామానికి చెందిన కొత్తపల్లి స్పందన(30) తలసేమియా, కిడ్నీ వ్యాధితో బాధపడుతూ బుధవారం రాత్రి మరణించారు. ఈమె పలాస మండలం మాకన్నపల్లి గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించే వారు. పుట్టుకతో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న స్పందనకు రెండేళ్ల క్రితం కిడ్నీవ్యాధి సోకింది. విశాఖపట్నం, శ్రీకాకుళం, పలాస తదితర ప్రాంతాల్లో చికిత్స అందించారు. బుధవారం వరకు విధులు నిర్వహించారు. ఆమె పరిధిలో గల చిన్నబీలావతిలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఇంటికి వెళ్లిన స్పందన తర్వాత రాత్రి 10 గంటల సమయంలో ద్రవాహారం తీసుకుంటూ 'నాన్నా.. నేను చనిపోతున్నాను..' అని బాధతో చెప్పి ఒక్కసారిగా కుప్పకూలి మరణించారు. కళ్లెదుటే కుమార్తె మరణించడంతో తల్లిదండ్రులు హేమారావు, వాణిప్రసన్న కన్నీరుమున్నీరుగా విలపించారు. వాణిప్రసన్న పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సోదరి మోనిక ఎంబీబీఎస్, సోదరుడు సాయి బీటెక్ చేశారు. స్వగ్రామమైన వీవీఆర్‌పురంలో గురువారం అంత్యక్రియలు జరిగాయి. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు తెంబ వాసుదేవరావు, వై.తులసీదాసు, సంక కాళిదాసు, బడియా వల్లభరావు, ఇప్పిలి చంద్రశేఖర్, తలగాన హేమారావు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొని స్పందన కుటుంబానికి సంతాపం తెలిపారు.

బదిలీల తప్పిదాలను సరిచేయాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఆపస్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ బదిలీలలో జరిగిన తప్పిదాలను తక్షణమే సరిచేసి నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు ఎస్.నరసింగరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బదిలీలు, ప్రమోషన్లలో నూతన పాఠశాలలకు చేరిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు జీతాలు అందలేదని గుర్తు చేశారు. అనంతరం నూతన డీఈవో కె.వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపి, వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యదర్శి పైడి కాశీ విశ్వనాథ్, బి.గోవిందరావు, డి.శివరాంప్రసాద్, ఎన్.గౌరీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అండర్–11 చెస్‌పోటీలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. అరసవల్లి రోడ్‌లో ఉన్న ఇందిరావిజ్ఞాన్ భవన్ వేదికగా మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి అండర్ –11 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్–2023 పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎనిమిదేళ్లుగా 15కు పైగా టోర్నమెంట్లు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చొక్క లింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, దరి సత్యన్నారాయణ ట్రస్ట్ అధినేత చౌదరి సతీష్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, మీట్ కన్వీనర్ సనపల అన్నాజీరావు, ఆర్గనైజర్ సనపల భీమారావు, చీఫ్ ఆర్బిటర్ జి.వి.కుమార్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది కిషోర్, అప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. 8 రౌండ్లపాటు జరిగే ఈ టోర్నమెంట్లో గెలుపొందిన క్రీడాకారులు అక్టోబర్ 1 నుంచి విశాఖపట్నంలో జరగనున్న జాతీయ స్థాయి అండర్–11 చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవుతారని ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సనపల భీమారావు తెలిపారు.



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న యువనేత రామ్‌మనోహర్‌నాయుడు

వ్యక్తి ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. వాంబేకాలనీకి చెందిన రాజాపంతుల ధనలక్ష్మికి ఇద్దరు వివాహమైన కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ (30) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి అక్రమంగా మద్యం తెస్తూ పాతపట్నం పోలీసులకు చిక్కాడు. ఎక్సైజ్ కేసు నమోదవ్వడంతో వాయిదాలకు తిరుగుతుండేవాడు. మద్యం ఇదివరకే అలవాటు ఉండటం, పనికి వెళ్లకుండా ఎక్కడికక్కడ అప్పులు వాడుకోవడం, ఇంటి నిర్మాణానికి అప్పు వాడటం.. వారంతా అడుగుతుండటంతో ఎప్పుడూ దిగాలుగా ఉండేవాడు. ఈ క్రమంలో గురువారం వరండాలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.



సత్యనారాయణ (ఫైల్)

'మదిలో మది' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: ధర్మాన హేమలత బ్యానర్‌పై నిర్మించిన 'మదిలో మది' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ గురువారం బాపూజీ కళామందిర్‌లో సందడిగా సాగింది. దర్శకుడు ప్రకాశ్ పల్ల మాట్లాడుతూ మంచి ప్రేమకథా చిత్రమని, ఆగస్టు 18న సినిమా థియేటర్స్‌లో విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ధర్మాన రామమనోహర్‌నాయుడు ఆశీస్సులతో చిత్ర నిర్మాణం జరిగిందని చెప్పారు. కథానాయకుడుగా నేమకూరి జయ్‌కుమార్, సహ దర్శకుడు ప్రదీప్ నావి, సంగీతం షారూఖ్, ప్రమోషన్ మేనేజర్‌గా పట్ట జనార్దనరావులు పనిచేశారని తెలిపారు. సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత ఎం.వి.స్వరూప్, జేసీఐ గ్రీన్‌సిటీ ప్రతినిధులు పాలిశెట్టి మధుబాబు పాల్గొన్నారు.



ట్రైలర్ ఆవిష్కరణలో చిత్రబృందం, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పద్మనాభపురం పాత జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జయరామచంద్రపురం గ్రామానికి చెందిన యువకుడు, మాకన్నపల్లికి చెందిన మరో యువకుడు గాయపడటంతో పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలంలో ద్విచక్ర వాహనాలు

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పర్యటన నేడు

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాంలు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నట్లు మంగళగిరి కమిషన్ కార్యాలయం కార్యదర్శి టీవీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత టూర్ షెడ్యూల్ సమాచారాన్ని కలెక్టర్, జిల్లా ఎస్పీలకు చేరవేశారు. ఉదయం 9.30కు జిల్లాలో ఒక కేజీబీవీ స్కూల్‌ను పరిశీలిస్తారు. 10.30 గంటలకు శ్రీకాకుళ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత స్కూళ్లు, ప్రైవేటు కాలేజీలు పరిశీలిస్తారు.

'నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే'

టెక్కలి: ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేస్తున్న రేషన్ బియ్యంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న భోజనాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు వెల్లడించారు. డివిజన్ కేంద్రమైన టెక్కలిలో గురువారం ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులంతా ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా స్థానిక గొల్లవీధిలో గల 114 నంబర్ రేషన్ డిపోను పరిశీలించి స్టాకు వివరాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టాకు వివరాల్లో 6 బియ్యం బస్తాలు వ్యత్యాసం ఉండడంతో డిపోను సీజ్ చేయాలని ఆదేశించారు. అలాగే డిపోకు చెందిన ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. స్టాకు వివరాలు లేకపోవడం, పంచదార అందుబాటులో లేకపోవడంతో ఆపరేటర్‌కు నోటీసులు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అనంతరం గొల్లవీధి, ఆదిఆంధ్రావీధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. గొల్లవీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం వండిన పప్పు సక్రమంగా లేకపోవడం, స్టాకు వివరాలు సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే కార్యకర్త నిర్మలకు మెమో అందజేయాలని ఆయన ఆదేశించారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ప్రస్తుతం టమాటా అధిక ధరలు ఉన్నప్పటికీ విద్యార్థులకు చట్నీ పెట్టడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనాలు చేశారు. ఆయనతోపాటు డీఎస్ఓ డి.వెంకటరమణ, తహసీల్దారు కె.ప్రవల్లికప్రియ, డీఎంసీ సహాయ మేనేజర్ దామోదర్రావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కె.లక్ష్మితో పాటు తూనికలు కొలతల శాఖాధికారులు, ఐసీడీఎస్, సంక్షేమ వసతి గృహాల సిబ్బంది పాల్గొన్నారు.



టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు తదితరులు